ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

మన ప్రజాప్రతినిధి

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

తెలుగు దినపత్రిక

సంపటి : 4	సంచిక :24	హైదరాబాద్	సోమవారం	నవంబర్ 23 2026	పేజీలు : 4 వేల : 2/

Published From:Telangana & Andrapradesh,Hyderabad & Vijayawada.Editar:G.Srinivas,epaper.manaprajaprathinidhi,com.

హుజూర్‌నగర్ ఎక్సైజ్ శాఖలో.....



'పింఛన్' వివాదం.....!



- గీత కార్మికుల పింఛన్లకు ఇతర కులాల లబ్ధిదారులా?
- ధ్రువీకరణ పత్రాల జారీపై అనుమానాలు.. అధికారుల మధ్య బాధ్యతల పంచాయితీ!
- అర్హులైన గౌడ కులస్థులకు దక్కాల్సిన పింఛన్లు ఇతరులకు ఎలా మంజూరయ్యాయి?
- ఎక్సైజ్ శాఖ అనుమతి లేకుండా ఎంపీడీవో కార్యాలయం పింఛన్లు ఎలా మంజూరు చేసింది?
- నకిలీ ధ్రువీకరణ పత్రాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గౌడ సంఘాల డిమాండ్!
- గీత కార్మికుల పెన్షన్ జీవోలో గౌడ్స్ ఇవ్వమని చెప్పారు ఇతర కులాలకు ఇవ్వమని చెప్తారా?.
- నకిలీ ధ్రువీకరణ పత్రాలతో ఇతర కులాల చలామణి ఏంటి. ఎక్సైజ్ శాఖ అనుమతి లేనిది ఎంపీడీవో పెన్షన్ ఎలా మంజూరు చేశారు.
- అర్హులైన గీత కార్మికులకు అన్యాయం జరుగుతుందా?..
- గౌడ కులస్థులకు సంబంధించిన పెన్షన్ ఇతర కులాలకు మంజూరు చేయాల్సిన అవసరం ఏముంది.
- తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకొని నకిలీ ధ్రువీకరణ పత్రాలు తీసుకున్న వారిపై కేసులు నమోదు చేయాలి అని గౌడ కులస్తుల డిమాండ్..
- ఎంపీడీవో వివరణ ఏంటి?. ఎక్సైజ్ శాఖ కుల ధ్రువీకరణ పత్రాల ఆధారంగా మేము ఎంపిక చేసాము మాకు ఎలాంటి సంబంధం లేదని చేతులెత్తేశారు.
- ఇక్కడ అన్యాయం జరిగింది ఎవరికి గీత కార్మికులకు ఎంపీడీవో,ఎక్సైజ్ శాఖ బాగానే ఉన్నారు..
- అర్హులైన గీత కార్మికులకు మాత్రమే పెన్షన్ మంజూరు చేయాలి, ఇతర కులాల వారికి పెన్షన్ మంజూరైన రిజెక్ట్ చేయాలి అని గౌడ సంఘాల డిమాండ్.

మనప్రజాప్రతినిధి //హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని గరిడేపల్లి మండలంలో గీత కార్మికుల పింఛన్ల వ్యవహారం వివాదాస్పదంగా మారింది. గీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న అర్హులైన గౌడ కులస్థులకు అందాల్సిన పింఛన్ల విషయంలో ఇతర కులాలకు చెందిన వ్యక్తులకు లబ్ధి చేకూరిందన్న ఆరోపణలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత ఉన్న గీత కార్మికులకే పింఛన్లు మంజూరు చేయాల్సి ఉండగా, ఇతర కులాల వారికి ఏ ప్రాతిపదికన పింఛన్లు మంజూరు చేశారన్న ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వచ్చాయి.గరిడేపల్లి మండలంలోని కొన్ని గ్రామాల్లో గౌడ కులస్థులకు సంబంధించిన గీత కార్మికుల పింఛన్లు ఇతర కులాలకు చెందిన వ్యక్తులకు మంజూరయ్యాయని ఆరోపిస్తూ గౌడ సంఘాల నాయకులు మండల ఎంపీడీవోను కలిసి వినతిపత్రం అందజేశారు. గీత కార్మికుల కోసం ఉద్దేశించిన పింఛన్లలో ఇతరులు ఎలా లబ్ధిదారులుగా ఎంపికయ్యారని, వారికి కుల ధ్రువీకరణ పత్రాలు ఎవరు జారీ చేశారని అధికారులను ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి అర్హులకు న్యాయం చేయాలని కోరారు.

ఒక శాఖపై మరో శాఖ బాధ్యతలు నెట్టివేత!

గౌడ సంఘాల నాయకులు ఎంపీడీవోను వివరణ కోరగా, పింఛన్ల మంజూరులో తమ పాత్రకు సంబంధించిన వివరణ ఇచ్చినట్లు తెలిసింది. ఎక్సైజ్ శాఖ జారీ చేసిన కుల ధ్రువీకరణ పత్రాలు, లైసెన్సులను ప్రామాణికంగా తీసుకొని లబ్ధిదారులను ఎంపిక చేశామని, ఈ విషయంలో ఎక్సైజ్ శాఖ అధికారులను సంప్రదించి నివేదిక తీసుకోవాలని ఎంపీడీవో సూచించినట్లు నాయకులు వెల్లడించారు.అయితే అసలు ప్రశ్న ఇక్కడే మొదలైంది. ఎక్సైజ్ శాఖ నుంచి ధ్రువీకరణ పత్రాలు, లైసెన్సులు ఎలా జారీ అయ్యాయి? వాటి పరిశీలనలో ఏ నిబంధనలు పాటించారు? గీత కార్మికుల పింఛన్లకు అర్హత లేని వ్యక్తులకు సంబంధిత పత్రాలు అందాయా? ఒకవేళ పత్రాల జారీలో పొరపాట్లు జరిగితే వాటిని గుర్తించాల్సిన బాధ్యత ఎవరిది? అనే ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది.

గీత కార్మికుల హక్కులకు గండికొడుతున్నారా?


గీత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా పింఛన్ల పథకాన్ని అమలు చేస్తుంటే, అర్హత లేని వ్యక్తులకు లబ్ధి చేకూరితే నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరిగినట్లేనని గౌడ సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో జీవిస్తున్న గీత కార్మికులకు అందాల్సిన ప్రభుత్వ ప్రయోజనాలు ఇతరులకు మళ్లడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.గౌడ కులానికి సంబంధించిన సంక్షేమ పథకంలో అర్హతలను పక్కనపెట్టి పత్రాల ఆధారంగా పింఛన్లు మంజూరు చేస్తే అసలు లబ్ధిదారులకు న్యాయం ఎలా జరుగుతుందని నిలదీ స్తున్నారు. ధ్రువీకరణ పత్రాల నిజానిజాలు తేల్చకుండా పింఛన్లు మంజూరు చేయడంపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు.

నిరాహార దీక్షకు దిగుతాం.గౌడ సంఘాల హెచ్చరిక!

గీత కార్మికుల పింఛన్ల విషయంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అవకతవకలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని గౌడ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అర్హులైన గౌడ కులస్థులకు మాత్రమే నిబంధనల ప్రకారం పింఛన్లు మంజూరు చేయాలని, అనర్హులకు మంజూరైన పింఛన్లపై విచారణ జరిపి నిబంధనలకు విరుద్ధంగా ఉంటే రద్దు చేయాలని కోరారు.నకిలీ ధ్రువీకరణ పత్రాలు సమర్పించినట్లు విచారణలో తేలితే సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. త్వరలో జిల్లా కలెక్టర్‌ను కలిసి పూర్తిస్థాయి ఆధారాలతో వినతిపత్రం అందజేస్తామని తెలిపారు.

కలెక్టర్ విచారణతోనే అసలు నిజాలు వెలుగులోకి!

ఈ వ్యవహారంలో ఎక్సైజ్ శాఖ జారీ చేసినట్లు చెబుతున్న ధ్రువీకరణ పత్రాల నిజానిజాలు ఏమిటి? పింఛన్లకు అర్హతలను నిర్ణయించిన విధానం ఏమిటి? ఇతర కులాలకు చెందిన వ్యక్తులు లబ్ధిదారులుగా ఎలా ఎంపికయ్యారు? అధికారుల పరిశీలనలో లోపాలు జరిగాయా? అన్న అంశాలపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణకు ఆదేశించాల్సిన అవసరం ఉందని గౌడ సంఘాల నాయకులు కోరుతున్నారు.ఒక శాఖ పత్రాలు ఇచ్చిందని మరో శాఖ బాధ్యత నుంచి తప్పించుకుంటే, మరోవైపు తమకు సంబంధం లేదని అధికారులు చేతులెత్తేస్తే చివరకు నష్టపోయేది మాత్రం అర్హులైన గీత కార్మికులేనన్న ఆవేదన వ్యక్తమవుతోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందాల్సిందే తప్ప, నిబంధనల ఉల్లంఘనకు తావుండకూడదని వారు స్పష్టం చేస్తున్నారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందిస్తారా? గీత కార్మికుల పింఛన్లపై సమగ్ర విచారణ జరిపి అర్హులకు న్యాయం చేస్తారా? లేక ఈ శాఖల మధ్య బాధ్యతల పంచాయితీ ఇలాగే కొనసాగుతుందా? అన్నది వేచి చూడాలి.ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా సర్దార్ సర్వాయి పాపన్న సేన అధ్యక్షుడు అనంతు గురవయ్య గౌడ్, తెలంగాణ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కొప్పు లక్ష్మీనారాయణ గౌడ్, గరిడేపల్లి మండల మాజీ ఎంపీటీసీ రావుల ఆంజనేయులు గౌడ్, నర్సింగ్ నాగసైదులు గౌడ్, బొల్లెపల్లి శ్రీనివాస్ గౌడ్, నర్సింగ్ వినయ్ గౌడ్, కారింగుల గురుస్వామి గౌడ్ తదితర గౌడ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

మన ప్రజాప్రతినిధి

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

తెలుగు దినపత్రిక

సంపటి : 4	సంచిక :24	హైదరాబాద్	సోమవారం	నవంబర్ 23 2026	పేజీలు : 4 వేల : 2/

Published From:Telangana & Andrapradesh,Hyderabad & Vijayawada.Editar:G.Srinivas,epaper.manaprajaprathinidhi,com.

12 ఎకరాలకు కృష్ణకాంత్ పార్కు చెరువు విస్తరణ

- వాకర్స్‌తో హైడ్రా కమిషనర్
- వరదనీటి మళ్లింపునకు ప్రత్యేక ఏర్పాట్లు
- పార్కు సమస్యల పరిష్కారానికి వినతులు
- ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి



నామినేషన్ల అడ్డగింత, దాడులతో ప్రజాస్వామ్యానికి తూట్లు

- కూటమి నేతలపై వైఎస్సార్‌సీపీ నాయకుల తీవ్ర ఆరోపణలు
- స్క్రూటినీలో అకారణంగా నామినేషన్ల తిరస్కరణ
- హౌస్ అరెస్టులు, దాడులపై ఎస్ఈసీకి ఫిర్యాదు
- పంచాయతీ ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించాలని డిమాండ్



ఎన్నికల అక్రమాలపై గవర్నర్‌కు బొత్స ఫిర్యాదు

- కూటమి ప్రభుత్వంపై ప్రజాస్వామ్య హక్కుల ఉల్లంఘన ఆరోపణలు
- వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అడ్డుకుంటున్నారని విమర్శలు
- పోలీసుల తీరుపై తీవ్ర అభ్యంతరం
- ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని రాష్ట్రపతికి విజ్ఞప్తి



అమరావతి, నవంబర్ 22 (మనప్రజాప్రతినిధి): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ తీరుపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం పోలీసు వ్యవస్థను ఉపయోగించుకుని ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాలరాస్తోందని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకోవడం, బెదిరింపులకు పాల్పడటం, దౌర్జన్యాలకు దిగడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలను ఆధారాలతో సహా గవర్నర్ దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం సమర్పించినట్లు వెల్లడించారు. హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పులను సైతం అమలు చేయకుండా అధికార యంత్రాంగం వ్యవహరిస్తోందని బొత్స ఆరోపించారు. 2

వ్యాధుల నివారణపై అణు, జన్యు స్థాయిలో పరిశోధనలు

- చికిత్స కంటే ముందస్తు నివారణకు ప్రాధాన్యం
- యువతలో పెరుగుతున్న జీవక్రియ సంబంధిత సమస్యలు
- ఖచ్చితమైన వైద్యానికి కొత్త పరిశోధనలు
- ముందస్తు గుర్తింపుతో మెరుగైన ఆరోగ్య సంరక్షణ



న్యూఢిల్లీ, నవంబర్ 22 (మనప్రజాప్రతినిధి): దేశంలో ఆరోగ్య పరిశోధనల దిశ మారుతోందని కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు. వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స అందించడమే కాకుండా, అవి రాకముందే గుర్తించి నివారించే విధానాలపై భారత్ ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. అణు, జన్యు స్థాయిల్లో ఆధునిక పరిశోధనలు చేపట్టడం ద్వారా భవిష్యత్తులో వైద్య రంగంలో కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. న్యూఢిల్లీలో నిర్వహించిన 'ది వీక్ హెల్త్ సమ్మిట్ 2026'లో ఆయన ఈ విషయాలను వెల్లడించారు. ప్రస్తుతం యువతలోనూ జీవక్రియ సంబంధిత ఆరోగ్య సమస్యలు పెరుగుతుండటం ఆందోళన కలిగించే అంశమని మంత్రి అభిప్రాయపడ్డారు. మధుమేహం, ఊబకాయం, ఇతర జీవక్రియ రుగ్మతలు చిన్న వయసులోనే ప్రభావం చూపుతున్న నేపథ్యంలో నివారణ వైద్యానికి ప్రాధాన్యం పెరుగుతోందని వివరించారు. జీవనశైలి మార్పులతో పాటు వ్యాధుల ముప్పును ముందుగానే గుర్తించే పరిశోధనలు అవసరమని పేర్కొన్నారు.వ్యాధుల మూలాలను అర్థం చేసుకునేందుకు అణు, జన్యు స్థాయిల్లో పరిశోధనలు చేయడం ద్వారా వైద్య శాస్త్రంలో కీలక మార్పులు 2

పానకాల లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్న పల్లా శ్రీనివాసరావు

- మంగళగిరి ఆలయంలో ప్రత్యేక పూజలు
- రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రార్థనలు
- ఆలయ అభివృద్ధి పనుల పరిశీలన
- పనుల పురోగతిపై అధికారులతో ఆరా



బుల్లెట్ రైలు ప్రాజెక్టులో కీలక ముందడుగు

- సూరత్‌బిలిమోరా మార్గంలో ఓహెచ్ఈ ఛార్జింగ్ పూర్తి
- విద్యుత్ వ్యవస్థ విజయవంతంగాప్రారంభం
- తొలి బుల్లెట్ రైలు ప్రయాణానికి సన్నాహాలు
- ముంబైఅహ్మదాబాద్ ప్రాజెక్టులో పెరిగిన పనుల వేగం

న్యూఢిల్లీ, నవంబర్ 22 (మనప్రజాప్రతినిధి): భారతదేశపు తొలి బుల్లెట్ రైలు ప్రాజెక్టు ముంబైఅహ్మదాబాద్ హైస్పీడ్ రైలు మార్గంలో మరో కీలక మైలురాయి నమోదైంది. ప్రాజెక్టులో భాగంగా సూరత్‌బిలిమోరా సెక్షన్‌లో ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్ (ఓహెచ్ఈ) విద్యుత్ వ్యవస్థను విజయవంతంగా ఛార్జ్ చేశారు. దీంతో దేశంలో హైస్పీడ్ రైలు సేవలను ప్రారంభించే దిశగా మరో ముందడుగు పడింది. ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో ఈ పరిణామం కీలకంగా మారింది. బుల్లెట్ రైలు ప్రయాణానికి అవసరమైన విద్యుత్ సరఫరా వ్యవస్థలో ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్ అత్యంత ముఖ్యమైన భాగం. రైలు పైభాగంలో ఉండే పరికరం ద్వారా విద్యుత్‌ను అందుకునేలా పట్టాల పైన ప్రత్యేక విద్యుత్ 2

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

- సర్పంచ్ అభ్యర్థులకు అచ్చెన్నాయుడు శుభాకాంక్షలు
- చిన్నబమ్మిడి నుంచి చల్లా అరుణమ్మ బరిలోకి
- నిమ్మాడలో కింజరాపు చారుమతి నామినేషన్
- ర్యాలీలతో సందడిగా నామినేషన్ల కార్యక్రమం





శ్రీకాకుళం, నవంబర్ 22 (మనప్రజాప్రతినిధి): చిన్నబమ్మిడి, నిమ్మాడ గ్రామాల సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థులకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. చిన్నబమ్మిడి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా చల్లా అరుణమ్మ, నిమ్మాడ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా కింజరాపు చారుమతి నామినేషన్లు దాఖలు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, అభిమానుల సందడి మధ్య వారు ర్యాలీగా బయలుదేరడం సంతోషాన్నిచ్చిందని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. రెండు గ్రామాల్లోనూ అభ్యర్థుల నామినేషన్ కార్యక్రమం సందర్భంగా పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్యకర్తల ఉత్సాహం మధ్య అభ్యర్థులు ర్యాలీగా నామినేషన్ కేంద్రాలకు వెళ్లారు. ఈ కార్యక్రమం గ్రామాల్లో రాజకీయ సందడిని నెలకొల్పింది. అభ్యర్థులకు మద్దతుగా పార్టీ శ్రేణులు పాల్గొన్నాయి. చిన్నబమ్మిడి గ్రామంలో చల్లా అరుణమ్మ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసేందుకు ముందుకు వచ్చారు. అదేవిధంగా నిమ్మాడ గ్రామం నుంచి కింజరాపు చారుమతి సర్పంచ్ పదవికి పోటీ చేస్తున్నారు. ఈ రెండు గ్రామాల్లో కూటమి అభ్యర్థులుగా వారు ఎన్నికల బరిలో నిలుస్తుండటంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు వారికి మద్దతుగా నిలిచారు. ఈ ఎన్నికల్లో అభ్యర్థులు విజయం సాధించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆకాంక్షించారు. ప్రజల ఆదరాభిమానాలతో గెలుపొందిన అనంతరం గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. స్థానిక ప్రజల అవసరాలను గుర్తించి, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. గ్రామస్థాయి పాలనలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని, ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి, ప్రజాసేవ లక్ష్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన సందేశం ఇచ్చారు. చిన్నబమ్మిడి, నిమ్మాడ గ్రామాల సర్పంచ్ ఎన్నికల్లో చల్లా అరుణమ్మ, కింజరాపు చారుమతి విజయం సాధించి ప్రజాసేవలో ముందుండాలని అచ్చెన్నాయుడు శుభాకాంక్షలు తెలిపారు.

వ్యాధుల నివారణపై అణు, జన్యు స్థాయిలో పరిశోధనలు



సాధ్యమవుతాయని తెలిపారు. ఒకే వ్యాధి వివిధ వ్యక్తుల్లో భిన్నంగా ఎందుకు ప్రభావం చూపుతుందో తెలుసుకోవడానికి జన్యు సంబంధిత అధ్యయనాలు దోహదపడతాయి. ఈ పరిశోధనల ఆధారంగా వ్యక్తుల శరీర తత్వం, జన్యు లక్షణాలకు అనుగుణంగా వైద్య విధానాలను రూపొందించే అవకాశాలు విస్తరిస్తాయని వివరించారు. ఈ దిశగా సాగుతున్న పరిశోధనలు ఖచ్చితమైన వైద్యం (ప్రెసిషన్ మెడిసిన్) అభివృద్ధికి కొత్త మార్గాలను తెరుస్తున్నాయి. వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులు, జన్యు లక్షణాలను పరిగణనలోకి తీసుకుని చికిత్స అందించడం ద్వారా వైద్య సేవలను మరింత సమర్థంగా మార్చవచ్చని భావిస్తున్నారు. అలాగే వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన జోక్యం చేసుకునేందుకు ఆధునిక పరిశోధనలు ఉపయోగపడనున్నాయి. దేశంలో ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు పరిశోధనలకు ప్రాధాన్యం పెరుగుతోందని జితేంద్ర సింగ్ వెల్లడించారు. వ్యాధుల నివారణ, ముందస్తు గుర్తింపు, వ్యక్తిగత అవసరాలకు అనుగుణమైన చికిత్స వంటి అంశాలు రాబోయే రోజుల్లో వైద్య రంగంలో కీలక పాత్ర పోషించనున్నాయి. ఈ మార్పులతో ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి

నామినేషన్ల అడ్డగింత, దాడులతో ప్రజాస్వామ్యానికి తూట్లు



విజయవాడ, నవంబర్ 22 (మనప్రజాప్రతినిధి): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించాల్సిన కూటమి ప్రభుత్వం పోలీసుల అండతో అక్రమాలకు పాల్పడుతోందని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. నామినేషన్లు దాఖలు చేయకుండా అభ్యర్థులను అడ్డుకోవడం, ఇప్పటికే దాఖలు చేసిన నామినేషన్లను వివిధ కారణాలు చూపుతూ తిరస్కరించడం, నాయకులను హౌస్ అరెస్టులు చేయడం వంటి చర్యలతో ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. కూటమి నాయకుల ఎన్నికల అక్రమాలపై రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) అధికారులను కలిసి ఫిర్యాదు చేసిన అనంతరం విజయవాడలో మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియలో జరుగుతున్న పరిణామాలపై ఆధారాలతో సహా ఫిర్యాదులు అందించినప్పటికీ తగిన చర్యలు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.పలు ప్రాంతాల్లో నామినేషన్ కేంద్రాల వద్ద పెద్ద సంఖ్యలో వ్యక్తులను సమీకరించి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులపై దాడులకు పాల్పడుతున్నారని నాయకులు ఆరోపించారు. పెట్రోల్ బాంబులు, రాళ్లు, కర్రలతో దాడులు చేస్తున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారని విమర్శించారు. పులివెందుల, పిడుగురాళ్ల, చంద్రగిరి ప్రాంతాల్లో అభ్యర్థులను అడ్డుకోవడం, నాయకులను గృహ నిర్బంధంలో ఉంచడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయని తెలిపారు. స్క్రూటినీ సమయంలో చిన్నచిన్న కారణాలను చూపుతూ నామినేషన్లు తిరస్కరిస్తున్నారని, అధికార పార్టీ ఒత్తిళ్లకు పోలీసు, రెవెన్యూ, ఎన్నికల అధికారులు తలొగ్గుతున్నారని ఆరోపించారు.పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (రైతు విభాగం) ఎంవీఎస్ నాగిరెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదులు అందిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగడం లేదన్నారు. 15, 16 పంచాయతీల చొప్పున చిన్నచిన్న కారణాలతో నామినేషన్లను తిరస్కరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ బృందం ప్రతిరోజూ 25 నుంచి 35 వరకు నిర్దిష్ట ఉదాహరణలతో ఫిర్యాదులు అందిస్తోందని తెలిపారు. ఎన్నికల కమిషన్‌కు పూర్తి అధికారాలు ఉన్నందున ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గకుండా అభ్యర్థులందరికీ నామినేషన్లు వేసే అవకాశం కల్పించాలని కోరారు. ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ మాట్లాడుతూ, మూడో విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల సమయంలోనే అభ్యర్థులను హౌస్ అరెస్టులు చేస్తున్నారని విమర్శించారు. పులివెందుల నియోజకవర్గంలోని చక్రాయపేట, తొండూరు మండలాల్లో నామినేషన్, స్క్రూటినీ ప్రక్రియలకు తమ పార్టీ వారిని అనుమతించడం లేదని ఆరోపించారు. సుమారు 700 నుంచి 800 మంది గుమిగూడి దాడులు చేస్తున్నా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.పార్టీ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ వింగ్ అధ్యక్షుడు నలమారు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, నెల రోజులుగా రోజుకు ఒకటి నుంచి మూడు సార్లు ఎన్నికల కమిషనర్‌ను కలిసి ఫిర్యాదులు చేస్తున్నా పరిస్థితిలో మార్పు రావడం లేదన్నారు. కడప, తిరుపతి, పల్నాడు జిల్లాల్లో పలు ప్రాంతాల్లో అభ్యర్థులను నామినేషన్ దాఖలు చేయకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. పిడుగురాళ్లలో ఓ ఎస్ఐ తలుపులు మూసి అభ్యర్థులను అడ్డుకున్నారని ఆరోపించారు. ఫిర్యాదులను డీజీపీకి పంపడంతోనే సరిపెట్టకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ ఎస్సీ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు మాట్లాడుతూ, మూడో విడత నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం నుంచే అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని విమర్శించారు. గ్రామ స్వరాజ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేస్తున్నారని ఆరోపించారు.పార్టీ దివ్యాంగుల విభాగం మాజీ అధ్యక్షుడు బండెల కిరణ్ రాజ్ మాట్లాడుతూ, నామినేషన్ల అడ్డగింత ఓటమి భయంతోనే జరుగుతోందని ఆరోపించారు. ప్రజలు తమకు నచ్చిన నాయకుడిని ఎన్నుకునే అవకాశం లేకుండా ఏకగ్రీవాలకు ప్రయత్నించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. దివ్యాంగ ఓటర్లకు అవసరమైన వీల్‌చైర్లు, ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఎన్నికల సంఘం తన స్వతంత్ర ప్రతిపత్తిని నిరూపించుకుంటూ అక్రమాలకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. ప్రతి అభ్యర్థికి నామినేషన్ వేసే హక్కు కల్పించాలని, ఓటర్లందరికీ అవసరమైన సౌకర్యాలు అందించి పంచాయతీ ఎన్నికలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని కోరారు. ఎన్నికల అక్రమాలపై తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు

బుల్లెట్ రైలు ప్రాజెక్టులో కీలక ముందడుగు



తీగలను ఏర్పాటు చేస్తారు. ఈ వ్యవస్థ ద్వారా రైలుకు అవసరమైన విద్యుత్ అందుతుంది. సూరత్‌బిలిమోరా మార్గంలో ఈ వ్యవస్థకు విజయవంతంగా విద్యుత్ సరఫరా చేయడం సాంకేతికంగా ముఖ్యమైన ఘట్టంగా నిలిచింది.ముంబైఅహ్మదాబాద్ బుల్లెట్ రైలు ప్రాజెక్టు దేశంలో రైల్వే రవాణా రంగాన్ని ఆధునికీకరించే లక్ష్యంతో చేపట్టిన భారీ మౌలిక సదుపాయాల కార్యక్రమం. ఈ మార్గంలో గంటకు అత్యధిక వేగంతో ప్రయాణించే రైళ్లను నడిపేందుకు అవసరమైన ప్రత్యేక పట్టాలు, విద్యుత్ వ్యవస్థలు, స్టేషన్లు, ఇతర సాంకేతిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నారు. సాధారణ రైలు మార్గాలతో పోలిస్తే హైస్పీడ్ రైలు వ్యవస్థకు ప్రత్యేక నిర్మాణ ప్రమాణాలు, అధునాతన భద్రతా సాంకేతికత అవసరమవుతాయి. సూరత్‌బిలిమోరా సెక్షన్‌లో విద్యుత్ వ్యవస్థ ఛార్జింగ్ పూర్తవడం ప్రాజెక్టులో వివిధ సాంకేతిక పనులు ముందుకు సాగుతున్నాయనే సంకేతాన్ని ఇస్తోంది. విద్యుత్ సరఫరా వ్యవస్థతో పాటు ఇతర సాంకేతిక విభాగాల పరీక్షలు, సమన్వయ పనులు కూడా కీలకంగా మారనున్నాయి. రైళ్ల నిర్వహణకు అవసరమైన అన్ని వ్యవస్థలను నిర్దేశిత ప్రమాణాల ప్రకారం సిద్ధం చేయడం ద్వారా ప్రయాణ భద్రతకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.దేశంలో తొలి బుల్లెట్ రైలు కార్యకలాపాలు ప్రారంభం కావాలనే లక్ష్యానికి ఈ పరిణామం మరో ముందడుగుగా నిలిచింది. ప్రాజెక్టు పనులు పూర్తవుతున్న కొద్దీ హైస్పీడ్ రైలు రవాణాపై ప్రజల్లో ఆసక్తి పెరుగుతోంది. అయితే ప్రయాణ సేవలు ఎప్పుడు ప్రారంభమవుతాయన్నది మిగిలిన నిర్మాణ పనులు, సాంకేతిక పరీక్షలు, భద్రతా అనుమతులపై ఆధారపడి ఉంటుంది. మొత్తంగా సూరత్‌బిలిమోరా సెక్షన్‌లో ఓహెచ్ఈ ఛార్జింగ్ విజయవంతం కావడం భారత రైల్వే చరిత్రలో మరో ముఖ్యమైన ఘట్టంగా నిలిచింది.

12 ఎకరాలకు కృష్ణకాంత్ పార్కు చెరువు విస్తరణ



హైదరాబాద్, నవంబర్ 22 (మనప్రజాప్రతినిధి): నగరంలో చెరువుల పునరుద్ధరణతో పాటు వరద ముప్పును తగ్గించేందుకు హైడ్రా చేపడుతున్న చర్యల్లో భాగంగా కృష్ణకాంత్ పార్కులోని చెరువును అభివృద్ధి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కృష్ణకాంత్ పార్కులో మార్నింగ్ వాకింగ్ చేస్తూ అక్కడి వాకర్స్‌తో ముచ్చటించారు. చెరువు పునరుద్ధరణ పనులు, పార్కు అభివృద్ధి, వరదనీటి నిర్వహణకు తీసుకుంటున్న చర్యలను వారికి వివరించారు. గతంలో మూడు ఎకరాలకే పరిమితమై మురికి కూపంగా మారిన చెరువును సుమారు 12 ఎకరాలకు విస్తరిస్తూ పునరుద్ధరిస్తున్నట్లు రంగనాథ్ తెలిపారు. చెరువులోకి వర్షపు నీరు నేరుగా చేరేలా ఇన్‌లెట్లను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. జూబ్లీహిల్స్, వెంకటగిరి ప్రాంతాల నుంచి భారీ వర్షాల సమయంలో పెద్ద మొత్తంలో వచ్చే వరదనీటిని క్రమబద్ధంగా చెరువుకు మళ్లించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. చెరువు లోతును పెంచి ఎక్కువ మొత్తంలో నీటిని నిల్వ చేసే సామర్థ్యాన్ని మెరుగుపరుస్తున్నట్లు వెల్లడించారు.ఈ ఏర్పాట్ల వల్ల కృష్ణానగర్, యూసుఫ్‌గూడ, మధురానగర్, శ్రీనివాస్‌నగర్, అమీర్‌పేట, మైత్రివనం పరిసర ప్రాంతాల్లో వర్షాల సమయంలో ఎదురయ్యే నీటిముంపు సమస్యను తగ్గించేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. చెరువు అభివృద్ధికి సంబంధించి వాకర్స్ నుంచి పలు సూచనలు, సలహాలను స్వీకరించారు. స్థానికుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుని చెరువు పునరుద్ధరణతో పాటు పరిసర ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం పార్కులో వాకర్స్, సందర్శకులు ఎదుర్కొంటున్న సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. పార్కు దక్షిణం వైపు ఉన్న చెత్త డంపింగ్ యార్డుకు ప్రహరీ లేకపోవడంతో దుర్వాసన వస్తోందని, చెత్తాచెదారం పార్కులోకి చేరుతోందని ఫిర్యాదు చేశారు. పార్కులోని జిమ్ పరికరాలు పాడయ్యాయని, వాటిని మరమ్మతు చేయడంతో పాటు కొత్త పరికరాలను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఇటీవల తమ్మిడికుంటలో హైడ్రా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ తరహాలో కృష్ణకాంత్ పార్కులోనూ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.చెరువు పునరుద్ధరణతో పాటు పార్కును కూడా సమగ్రంగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరారు. నగరంలో హైడ్రా పునరుద్ధరించిన చెరువులు ఆకర్షణీయంగా మారడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు, ప్రజల అవసరాలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని వాకర్స్ అభినందించారు. దాదాపు గంటపాటు సాగిన ఈ మార్నింగ్ వాకింగ్ కార్యక్రమం ప్రజల సమస్యలను తెలుసుకోవడంతో పాటు ప్రకృతి పరిరక్షణకు సంబంధించిన సూచనలు స్వీకరించే వేదికగా నిలిచింది.

ఎన్నికల అక్రమాలపై గవర్నర్‌కు బొత్స ఫిర్యాదు



ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులకు నామినేషన్లు వేసే అవకాశం కల్పించకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ పోలీసు వ్యవస్థ నుంచి ఆశించిన స్పందన రాకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా సాగేందుకు అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసు యంత్రాంగం అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గుతోందని బొత్స విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ పోలీసు వ్యవస్థను నడిపిస్తున్నారనే విమర్శలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని ఆరోపించారు. దాడులు, దౌర్జన్యాలు, ఎన్నికల అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని గవర్నర్‌ను కోరినట్లు తెలిపారు. ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించేందుకు రాజ్యాంగబద్ధమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలో కొనసాగేందుకు నైతిక అర్హత కోల్పోయిందని బొత్స వ్యాఖ్యానించారు. ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని రాష్ట్రపతికి, పార్లమెంట్‌కు సిఫార్సు చేయాలని గవర్నర్‌ను కోరినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ఎన్నికల సందర్భంగా చోటుచేసుకుంటున్న పరిణామాలపై ఉన్నతస్థాయిలో విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి అభ్యర్థికి సమాన అవకాశాలు కల్పించడం అధికార యంత్రాంగం బాధ్యత అని స్పష్టం చేశారు.ఎన్నికలను ధైర్యంగా, న్యాయబద్ధంగా ఎదుర్కొనే ప్రజాబలం కూటమికి ఉంటే ఎలాంటి అక్రమాలకు తావులేకుండా ఎన్నికలు నిర్వహించాలని బొత్స సవాల్ విసిరారు. అర్హులైన అభ్యర్థులందరికీ నామినేషన్లు దాఖలు చేసుకునే అవకాశం కల్పించి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరపాలని కోరారు. అలా కాకుండా ఏకపక్షంగా ఎన్నికలు నిర్వహించుకుని 100 శాతం స్ట్రైక్ రేట్ సాధించామని ప్రకటించుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. రాజ్యాంగాన్ని, చట్టాన్ని గౌరవిస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు.

పానకాల లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్న పల్లా శ్రీనివాసరావు



అమరావతి, నవంబర్ 22 (మనప్రజాప్రతినిధి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆదివారం మంగళగిరిలోని ప్రసిద్ధ శ్రీ పానకాల లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు.దర్శనం అనంతరం రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలు కలగాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజల జీవితాల్లో ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. స్వామివారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నారు. మంగళగిరి పానకాల లక్ష్మీ నరసింహస్వామి ఆలయం ఆధ్యాత్మికంగా ప్రత్యేక గుర్తింపు కలిగిన పుణ్యక్షేత్రం. ఇక్కడికి నిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. ఈ నేపథ్యంలో ఆలయంలో భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై పల్లా శ్రీనివాసరావు ప్రత్యేకంగా దృష్టి సారించారు.దర్శనం అనంతరం ఆలయ ప్రాంగణంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. వివిధ నిర్మాణ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు పూర్తయిన పనులు, ప్రస్తుతం కొనసాగుతున్న పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. పనుల స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు సేకరించారు. ఆలయ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని తెలుసుకున్న ఆయన పర్యటనతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఒక రూట్‌లో పోలీసుల బ్రేక్ మరో రూట్లో లారీలకు ఫుల్ స్పీడా?

-లింగగిరి రోడ్డులో ఆంక్షలు.. ఇందిరా సెంటర్‌లో ఆంక్షలు ఏమయ్యాయి?
-రూల్స్ అందరికీ ఒకటేనా? లేక రూట్ను బట్టి పోలీసుల లెక్కలు మారుతున్నాయా?


మనప్రజాప్రతినిధి// హుజూర్ నగర్ ,నవంబర్ 22:హుజూర్‌నగర్ పట్టణంలో భారీ లారీల రాకపోకలపై ట్రాఫిక్ నియంత్రణ ఏ విధంగా అమలవుతోంది. ఇప్పుడు ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. లింగగిరి రోడ్డు నుంచి పట్టణంలోకి లారీ వస్తే పొట్టి శ్రీరాములు సెంటర్ దగ్గర పోలీసుల ఆంక్షలు.. మరి ఇందిరా సెంటర్ వైపు నుంచి లారీ వస్తే ఆ ఆంక్షలు ఎక్కడికి పోతున్నాయి? లారీ ఏ దారి నుంచి వచ్చినా పట్టణంలోకి ప్రవేశిస్తున్నదే కదా! అలాంటప్పుడు ఒక మార్గంలో అడ్డుకట్ట.. మరో మార్గంలో ఎందుకు అనుమతి ఉంది? పోలీసుల ట్రాఫిక్ రూల్స్ రూట్లను బట్టి మారిపోతాయా? వెనుక లారీలు ఎక్కువగా చేరితే కొన్ని పంపించడం, మళ్లీ నిలిపివేయడం వల్ల ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుందా? లారీల వరుస పెరిగినప్పుడు ప్రస్తుతం వాహనాల రద్దీ మరింత తీవ్రమవుతోంది. పట్టణ ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతుంటే ఈ విధానంపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. ట్రాఫిక్ అంటే ఒక చోట ఆపడం, మరో చోట వదిలేయడం కాదు. పట్టణానికి వచ్చే అన్నిమార్గాల్లో ఒకే నిబంధనలు అమలు చేయాలి. లారీల రాకపోకలకు నిర్దిష్ట సమయాలను నిర్ణయించి, నిబంధనలను ఉల్లంఘించకుండా పర్యవేక్షించాలి. ఒకేపట్టణం.. ఒకే పోలీస్ వ్యవస్థ.. మరి ట్రాఫిక్ రూల్స్ మాత్రం రెండు విధాలుగా ఎందుకు? ప్రజల ప్రశ్నకు అధికారులు సమాధానం చెప్పాలి!







పోలీసుల విస్తృత వాహనాల తనిఖీలు



మన ప్రజాప్రతినిధి హుజూర్ నగర్ ,నవంబర్ 22: హుజూర్ నగర్, పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ నేర నియంత్రణే లక్ష్యంగా హుజూర్‌నగర్ పోలీసులు విజిబుల్ పోలీసింగ్‌ను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా పట్టణంలోని ప్రధాన కూడలి అయిన పీఎస్ఆర్ (గ్రూ=)సెంటర్ వద్ద పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తులు, రికార్డులు లేని వాహనాల కదలికలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. రద్దీ, ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటూ, వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పిస్తున్నారు. పట్టణ ప్రజలకు భద్రతా భావాన్ని కల్పించేందుకు, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై నియంత్రణ చర్యలు తీసుకుంటామని, పోలీసులు తనిఖీలకు సహకరించి అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే అందించాలని హుజూర్ నగర్ ఎస్ఐ పోలీసులకు సమాచారం అందించారు హనుమా నాయక్

బీజేపీ ఇంటెలెక్చువల్ సెల్ కోర్ టీమ్‌లో చేరిన ఆర్.ఎన్. రెడ్డి



మన ప్రజాప్రతినిధి హుజూర్ నగర్ నవంబర్ 22: హుజూర్ నగర్ పట్టణానికి చెందినఆర్.ఎన్. రెడ్డి ఐటీ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ (వీణ) బండా రామ నర్సి రెడ్డి భారతీయ జనతా పార్టీ (దీజ్రూ) తెలంగాణ రాష్ట్ర ఇంటెలెక్చువల్ సెల్ కోర్ టీమ్‌లో చేరారు.నవంబర్ 21న బీజేపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఎన్. రాంచందర్ రావు సమక్షంలో ఆయన ఇంటెలెక్చువల్ సెల్ కోర్ టీమ్‌లో చేరారు.విద్యా, సాంకేతిక రంగాల్లో తనకున్న అనుభవం, సామాజిక అంశాలపై అవగాహనతో పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆర్.ఎన్. రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు

అగ్నిప్రమాద బాధితులకు అండగా ఉంటాం ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట నవంబర్ 22:చేగుంట పట్టణ కేంద్రంలోని శ్రీ ధనలక్ష్మి హార్డ్‌వేర్ షాపులో చోటుచేసుకున్న అగ్నిప్రమాద ఘటనపై దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి స్పందించారు. మంగళవారం అగ్నిప్రమాదం జరిగిన షాపును సందర్శించి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా షాపు యజమానులు, బాధితులను కలిసి ప్రమాదంలో జరిగిన ఆస్తి నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు ధైర్యం చెబుతూ, వారికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. అదేవిధంగా అగ్నిప్రమాదానికి గల కారణాలు, జరిగిన నష్టం వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.ప్రమాదంతో నష్టపోయిన బాధితులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

దోమ బిఆర్ఎస్ నాయకులు వివాహ వేడుకల్లో



దోమ, ప్రజాప్రతినిధి, (నవంబర్ 22):దోమ మండల కేంద్రానికి చెందిన పోలీస్ అనంతరెడ్డి సుగుణమ్మ దంపతుల కుమారుడు పవన్ కుమార్ రెడ్డి, నవిత రెడ్డిల వివాహం దోమ, తిమ్మాయిపల్లి రోడ్ ఎస్జీ గార్డెన్స్ జరిగింది. ఈ వివాహానికి దోమ మండల మాజీ సర్పంచుల అధ్యక్షులు కుదురుమల్ల రాజిరెడ్డి హాజరై నూతన వధు వరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి మల్లేశం,మోత్కూర్ మాజీ ఉప సర్పంచ్ శ్రీకాంత్, వార్డు మెంబర్ మైనొద్దీన్, నాయకులు శ్రవణ్ కుమార్ రెడ్డి, వెంకట్ రెడ్డి, నవ తెలంగాణ ప్రతినిధి శివ భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృత్యువాత



మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట, నవంబర్ 22: చేగుంట మండలంలోని చందాయిపేట గ్రామ పరిధిలో గల దేవుని చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. చేగుంట ఎస్ఐ చైతన్య కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం చేట్ల నర్సంపల్లి గ్రామానికి చెందిన పసుల ఆంజనేయులు రాత్రి సమయంలో చేపలు పట్టేందుకు వల తీసుకొని దేవుని చెరువులోకి వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడిపోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడు.మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు చేగుంట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

పల్స్ పోలియో చుక్కలు వేయించాలి...
మాజీ మేయర్, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతగాని శాంతి కోటేష్ గౌడ్



ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక :మేడ్చల్ జిల్లా కీసర సర్కిల్ జవహర్‌నగర్ డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్ మెయిన్ రోడ్డు సెంటర్ లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మేయర్ జవహర్ నగర్ డివిజన్ అధ్యక్షులు దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ మరియు జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు బల్లి శ్రీనివాస్, డాక్టర్. శ్రీదేవి ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్.టి.ఈ.పి డాక్టర్. హారతి,మెడికల్ ఆఫీసర్ యు.పి.హెచ్.సి జవహర్ నగర్ హాజరై, చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు జిల్లా వైద్య అధికారులతో మాట్లాడుతూ,5 సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు.పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, తల్లిదండ్రులు తమ పిల్లలకు రెండు చుక్కలు వేయించి వారి భవిష్యత్తును కాపాడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కోశాధికారి పొలాసకిరణ్, చంద్రపురి డివిజన్ కాంగ్రెస్ పార్టీ కోశాధికారి నంగునూరి అశోక్ గుప్తా,బి.జయ, అంగన్వాడీ టీచర్ డి.స్వరూప,ఆశా వర్కర్లు, స్థానిక నాయకులు, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్య వైశ్యుల కార్తీక మాస వనభోజన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి



కోదాడ: కోదాడలోని ఈనాడు పుల్లయ్య గారి తోటలో ఆర్య వైశ్య రాయపూడి మిత్ర మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్య వైశ్యుల కార్తీక మాస వనభోజన కార్యక్రమంలో కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఆర్య వైశ్య కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటించారు. అనంతరం ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి మాట్లాడుతూ.. గత 34 ఏళ్లుగా కోదాడ నియోజకవర్గ ప్రజలు తమను ఆదరిస్తున్నారని, ఆర్య వైశ్య కుటుంబ సభ్యులు తనను ఇంటి ఆడబిడ్డగా భావించి ఆశీర్వదించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కోదాడ నియోజకవర్గానికి సేవ చేసే అవకాశం రావడం దైవ నిర్ణయంగా భావిస్తున్నానని తెలిపారు.కోదాడ నియోజకవర్గ అభివృద్ధి కోసం సుమారు రూ.2 వేల కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. కోదాడ పట్టణంలోనే దాదాపు రూ.500 కోట్ల విలువైన అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.ప్రధానంగా 100 పడకల ఆసుపత్రి, కోర్టు భవనం, ఆర్టీసీ డిపో మరియు బస్టాండ్, ఆర్అండ్‌బీ భవనం, ఇరిగేషన్ భవనం, నవోదయ పాఠశాల, న్యాక్ భవనం, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణంతో పాటు ఎత్తిపోతల పథకాల పనులు కొనసాగుతున్నాయని వివరించారు. కోదాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఆత్మీయంగా నిర్వహించిన ఆర్య వైశ్య రాయపూడి మిత్ర మండలి సభ్యులకు, పాల్గొన్న ఆర్య వైశ్య కుటుంబ సభ్యులందరికీ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



వైభవంగా బొంపల్లిలో అయ్యప్ప మహా పడిపూజ
డోలు వాయిద్యాలు, అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన గ్రామం.. భక్తులకు అన్నదానం



దోమ, ప్రజా ప్రతినిధి, (నవంబర్ 22):దోమ మండల పరిధిలోని బొంపల్లి గ్రామంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.గ్రామానికి చెందిన గంట స్వామి మహేష్ ఇంట్లో గురుస్వామి ప్రకాష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు.అయ్యప్ప స్వామికి సంప్రదాయబద్ధంగా అభిషేకాలు,అర్చనలు, పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.డోలు వాయిద్యాల నడుమ అయ్యప్ప స్వాముల భజనలు, అయ్యప్ప నామస్మరణతో గ్రామం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. పూజా కార్యక్రమాలను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ప్రార్థించారు.అనంతరం నిర్వాహకులు భక్తులకు, గ్రామస్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పాట మాట, నినాదాలతో మద్దతు ప్రకటించిన ఎమ్మెల్యే మల్లారెడ్డి



ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్ :జవహర్ నగర్ డంపింగ్ యార్డు తొలగింపు కోసం జరుగుతున్న రిలే నిరాహార దీక్షలకు ఎం.పి. ఈటెల రాజేందర్, అధికార కాంగ్రెస్ డిసిసి వజ్రేష్ యాదవ్ కూడ మద్దతుగా నిలబడాలని విజ్ఞప్తి. మొదటి రోజు రిలేదీక్ష కార్యక్రమం విజయవంతం అని ప్రకటించిన జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్ షావలి, కన్వీనర్ ఉమామహేష్. మద్దతు ప్రకటించి, దీక్షలో పాల్గొన్న యాంటి డంపింగ్ యార్డు దమ్మాయిగూడ జేఏసి, తదితరులు. ఆకట్టుకున్న జాన్, వెంకటాచారి ఉద్యమ పాటలు.మేడ్చల్ జిల్లా కీసర సర్కిల్ జవహర్ నగర్ డంపింగ్ యార్డును ఎన్నికలలో ఇచ్చిన హామీలో బాగంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే తొలగించి, కొత్త చెత్తను రాంకి డంపింగ్ యార్డుకు తీసుకురావడాన్ని ఆపాలని డిమాండ్ చేస్తూ ప్రారంభమైన రిలే నిరాహార దీక్షల మొదటి రోజు కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ జేఏసి చైర్మన్ షేక్ షావలి, కన్వీనర్ ఉమామహేష్ ప్రకటించారు. మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా, కీసర సర్కిల్, జవహర్ నగర్ జీహెచ్ఎంసీ పరిధిలోని చెన్నాపురం చౌరస్తాలో ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో 2026, నవంబర్-22, ఆదివారం రోజున రిలే దీక్షలు ప్రారంభమయ్యాయని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ నియోజకవర్గ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి గారు హాజరై, తమదైన శైలిలో పాట, మాట, నినాదాలతో అత్యంత ఉత్సాహ బరితంగా రిలేదీక్షలను ఉత్తెజపరిచి సంఘీభావం తెలిపారని అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20 ఏళ్లుగా జవహర్ నగర్ ప్రజలు డంపింగ్ యార్డు కాలుష్యంతో నరకం అనుభవిస్తున్నారని, దుర్వాసన, కలుషిత నీరు, విషపూరిత గాలితో పిల్లలు, వృద్ధులు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగరం మొత్తం చెత్తను ఒకే చోట వేయడం వల్లే ఈ సమస్య వచ్చిందని, చెత్తను డిసెంట్రలైజ్ చేసి, నాలుగు మూలలా చిన్నచిన్న ప్రాసెసింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.డంపింగ్ యార్డును శాస్త్రీయంగా మూసివేసే వరకు, కొత్త చెత్త రాకుండా ఆపే వరకు ఈ రిలే దీక్షలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.రోజుకు ఇద్దరు చొప్పున మరణిస్తున్నారని ఇది బాదకరమైన విషయమని ఆవేదన చెందారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, పాత చెత్తను రీసైకిల్ చేసి, యార్డును తొలగించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఇటు డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాటకమిటి, అటు దమ్మాయిగూడ జేఏసి వాళ్ళతో కలిసి ఐక్యంగా ఉద్యమించడానికి సిద్దంగా ఉన్నామని మల్లారెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో యాంటి డంపింగ్ యార్డు జేఏసీ దమ్మాయిగూడ నాయకులు, వివిధ పార్టీల, ప్రజాసంఘాలకు చెందిన నాయకులు, స్థానిక ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని, రిలే దీక్షలను విజయవంతంగా ముగిశాయని తెలియజేశారు.సిపిఐ దర్శనం యాదగిరి, నిమ్మల నర్సింహ్మ, సిపిఎం శివన్నారాయణ, కె.సురేందర్, సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ జయసుధ, సురేందర్, బీఎస్పీ బిర్రు యాకస్వామి, ఆమ్ ఆద్మీ పార్టీ మోహిన్, టిఆర్ఎస్ మేక లలిత యాదవ్, సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్ వి.ప్రవీణ్, డి.స్వరూప, ఎం.ఎల్.పి.ఐ.(రెడ్ ఫ్లాగ్) ఖాసీం, లింగస్వామి టిజేఎస్ ఎం.శ్రీనివాస్, టిడిపి టి.శ్రీరాములు, టియుజేఏసి ఎ.లలిత, డి.లలిత మరియు యాంటి డంపింగ్ యార్డు దమ్మాయిగూడ జేఏసి సమ్మిరెడ్డి, స్వర్ణ తమ సంపూర్ణ మద్దతును తెలియజేసి, దీక్షలో పాల్గొన్నారు. టియుజేఏసి తుమ్మల ప్రపుల్ రాంరెడ్డి, పిఓడభ్ల్యూ సంధ్య, సిఎంఎస్ సత్య, పికెఎం జాన్, ఐ.ఎఫ్.టి.యు. పి శివబాబు, ఏ.ఐ.ఎఫ్.టి.యు. వై మల్లేష్, పిడిఎం చంద్రమౌళి, సిపిఎం నగేష్, బహుజన రక్షణ సమితి మహ్మద్ జావేద్, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ మహ్మద్ పాషామియా,టి.కాలేషా, ప్రజానాట్యమండలి వెంకటాచారి, ఉద్యమ కళాకారుల వేదిక యాదగిరి, మహిళా విబాగం సుజి, పిఓడభ్ల్యూ(విముక్తి) గడిపే సునీత, సిఎంఎస్ జయ, కార్మికనగర్ దామాల ప్రబాకర్, శ్రీనివాస్, పిడిఎం రవి, సిజేపి శ్రావణ్ కుమార్ తదితర సంఘా నాయకులతో పాటు బీఆర్ఎస్ మేకల కావ్య, కొండల్ ముదిరాజ్, ఆలూరి సంగీత, రాజశేఖర్ దీక్షలకు హాజరై సందేశాలు ఇచ్చిన వారిలో ఉన్నారు.డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా జాన్, వెంకటాచారి కళాకారులు ఆలపించిన ఉద్యమ పాటలు ఆకట్టుకొని, దీక్షలో పాల్గొన్న వారికి ఎంతో ఉత్తేజాన్నిచ్చాయి.

ఉప్పల్‌లో పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్ :ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్వహించిన జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేశాన్ని పోలియో రహితంగా నిలబెట్టడంలో ప్రతి తల్లిదండ్రి బాధ్యతగా తమ ఐదేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజారోగ్య కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు వేయించకుండా మిగిలిపోకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ ఆనంద్ మాట్లాడుతూ, పోలియో నిర్మూలనలో ప్రజల సహకారం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయించే కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ఆరోగ్య శాఖ అధికారులు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

నేడు కరీంనగర్ లో జరిగే మహాపాదయాత్రను విజయవంతం చేయాలి

బిజేపీ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు దుర్శెట్టి సంపత్



మన ప్రజాప్రతినిధి/ మనకొండూరు తేదీ 22 నవంబర్ :ఇల్లంతకుంట మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు భూమల్ల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మహా పాదయాత్ర సన్నాహ సమావేశం లో కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు దుర్శెట్టి సంపత్, మహిళా మోర్చా గంగిపల్లి అంజలి పాల్గొన్నారు.ఈ సందర్భంగా దుర్శెట్టి సంపత్ మాట్లాడుతూ కరీంనగర్ లో జరగబోయే మహా పాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ పాదయాత్ర కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ విచ్చేస్తున్నారు అని తెలియజేశారు. ప్రతిపక్షాలు ప్రజాస్వామ్య విరుద్ధమైన రాజ్యాంగ విరుద్ధమైన కార్యకలాపాలకు ఒడిగడుతున్నాయని అన్నారు. రాజ్యాంగ విరుద్ధ శక్తులను ఎదుర్కోడానికి పెద్ద ఎత్తున యువత మోడీ కి మద్దతుగా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు దేశెట్టి శ్రీనివాస్, మేకల మల్లేశం, అమ్ముల అశోక్,మామిడి హరీష్,అసెంబ్లీ కోకన్వీనర్ బత్తిని స్వామి,మాజీ మండల అధ్యక్షులు నాగసముద్రాల సంతోష్,మండల ప్రధాన కార్యదర్శి కరికె నవీన్ కుమార్, పినికాసి అనిల్ మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు మారవెల్లి దివ్య, బీజేవైఎం మండల అధ్యక్షులు మంత్రి అరుణ్ మండల ఉపాధ్యక్షులు పండుగ లక్ష్మణ్, కూనబోయిన బాలరాజ్,మండల కోశాధికారి పిల్లి గోపాల్ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనగర్‌లో చిట్టీల దందా కలకలం!

-అనుమతులు ఉన్నాయా..? కమిషన్ల ముసుగులో చిట్టీల వ్యాపారమా?
-ప్రభుత్వ ఉద్యోగుల ప్రమేయంపై స్థానికుల్లో చర్చ.. సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్



(మన ప్రజా ప్రతినిధి సిద్దిపేట): సిద్దిపేట పట్టణ కేంద్రంలోని ఆదర్శనగర్‌లో చిట్టీల దందా వ్యవహారం ప్రస్తుతం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండానే చిట్టీల వ్యాపారం నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తుండటంతో పాటు, కమిషన్ల ముసుగులో ఈ వ్యవహారం సాగుతోందన్న ప్రచారం స్థానికుల్లో పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ వ్యవహారంలో ప్రభుత్వ ఉద్యోగుల ప్రమేయం ఉందనే ఆరోపణలు కూడా వినిపిస్తుండటంతో అసలు చిట్టీల దందా వెనుక ఎవరున్నారు? ఎవరి అండదండలతో ఈ వ్యాపారం కొనసాగుతోంది? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. చిట్టీల పేరుతో ప్రజల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు సేకరిస్తున్నట్లయితే, సంబంధిత నిబంధనలు పాటిస్తున్నారా? వ్యాపార నిర్వహణకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన రికార్డులు సక్రమంగా నిర్వహిస్తున్నారా? అనే అంశాలపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణకు విరుద్ధంగా ఇలాంటి ఆర్థిక కార్యకలాపాల్లో భాగస్వాములవుతున్నారనే ఆరోపణలు నిజమైతే వాటిపై శాఖాపరంగా కూడా విచారణ జరగాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.అధికారులు ఇప్పటికైనా స్పందించాలి!ప్రజల కష్టార్జిత డబ్బుతో ముడిపడి ఉన్న చిట్టీల వ్యవహారంలో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా సంబంధిత అధికారులు తక్షణమే రంగంలోకి దిగాలని స్థానికులు కోరుతున్నారు. ఆదర్శనగర్‌లో కొనసాగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న చిట్టీల వ్యాపారంపై సమగ్ర విచారణ చేపట్టి, అనుమతులు, ఆర్థిక లావాదేవీలు, ప్రభుత్వ ఉద్యోగుల ప్రమేయం వంటి అంశాలను నిగ్గు తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చట్టపరమైన, శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు కళ్లు తెరుస్తారా? లేక చిట్టీల దందా యథేచ్ఛగా కొనసాగుతుందా? అనేది వేచి చూడాల్సిందే!



